

విద్యుదాఘాతంతో మున్సిపల్ హెచ్‌ఎం దుర్మరణం


హెచ్‌ఎం కృష్ణారావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని సుభాష్‌చంద్రబోస్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం ఇలపకుర్తి కృష్ణారావు (60) విద్యుదాఘాతంతో శుక్రవారం ఉదయం మృతి చెందారు. నరసాపురంలో ఆయన కొత్త ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఆ పనుల్లో భాగంగా ఇంటిని తడిపేందుకు ప్రయత్నిస్తూ విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే అయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కృష్ణారావు స్వగ్రామం యలమంచిలి మండలం బాడవ, ఆయన పని చేస్తున్న పాలకొల్లులో విషాదఛాయలు అలుముకున్నాయి. కృష్ణారావు మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నేతలు, మున్సిపల్ కమిషనర్ శేషాద్రి సంతాపం ప్రకటించారు.

ప్రా'ధాన్యం' ఇచ్చేనా..!



- ప్రారంభమైన ఖరీఫ్ వరి మాసూళ్లు
- రెండు జిల్లాల్లో దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరిసాగు
- 9.95 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- తేమశాతం నిర్ధారణపై స్పష్టత కరువు
- వాహనాల ఏర్పాటుపై రైతులను వీడని ఆందోళన
- గోనె సంచుల ఏర్పాటు పూర్తి కానట్లు సమాచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ధాన్యం సేకరణపై అధికారులు మాటలకు.. చేతలకు పొంతన కన్పించడం లేదనే చర్చ నడుస్తోంది. గతంలో రైతులు ఎదుర్కొన్న తేమ శాతం నిర్ధారణలో తేడాలు, వాహనాల ఏర్పాటు, గోనె సంచుల సమస్యలపై ఇప్పటికీ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో ఖరీఫ్ ధాన్యం సేకరణలో మళ్లీ కష్టాలు తప్పవా అనే భయం రైతులను వెంటాడుతోంది. ప్రస్తుత ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. పశ్చిమలో 4.65 లక్షల టన్నులు, ఏలూరు జిల్లాలో 5.30 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికోసం ఏలూరు జిల్లాలో 394, పశ్చిమగోదావరి జిల్లాలో 314 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు సాగాయి. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది నియామకం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక్కడ వరకూ బాగానే ఉన్నప్పటికీ రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. గడిచిన రబీలో తేమశాతం నిర్ధారణపై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుభరోసా కేంద్రం అధికారులు తేమశాతం నిర్ధారించి అంతా బాగానే ఉందని చెప్పి ధాన్యం వాహనాల్లోకి ఎక్కించి మిల్లులకు పంపించేవారు. అయితే మిల్లర్లు మాత్రం తేమశాతంలో తేడా ఉందంటూ ధాన్యం దిగుమతి చేసుకోకుండా వాహనాల్లో నిలిపివేయడం జరిగింది. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి మాట్లాడుకుని మిల్లర్ నిర్దేశించిన తేమశాతానికి సొమ్ము చెల్లిస్తే తప్ప ధాన్యం దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో రైతులు మిల్లర్లకు ఎదురు సొమ్ము చెల్లించడంపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. అయినప్పటికీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేకపోయింది. మిల్లర్లు అధికారుల మాట ఏమాత్రం వినేవారు కాదు. దీంతో రైతులు ధాన్యం వాహనాలతో రోడ్లపై ఆందోళనలు చేసిన ఘటనలూ ఉన్నాయి. ఆ సమస్యపై ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదో అర్థం కావడం లేదు. రైతుభరోసా కేంద్రం అధికారులు నిర్ధారించిన తేమశాతం ఫైనలా లేక మిల్లర్లు చెప్పేది ఫైనలా అనేది స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. రైతుభరోసా కేంద్రంలో తేమశాతం ఫైనల్ చేసిన తర్వాత మిల్లర్లు అవరోధం పెడితే రైతులు ఏం చేయాలనే దానిపై అధికారులు చెప్పాల్సి ఉంది. అలాకాకుండా ధాన్యం కొనుగోలుకు ఎటువంటి ఇబ్బందీ లేదంటూ ప్రకటనలు గుప్పించడం వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదనే చర్చ రైతుల్లో నడుస్తోంది. రైతులు ఎదుర్కొంటున్న మరో సమస్య వాహనాల ఏర్పాటు. ధాన్యం రాశులుగా చేసి పది, 15 రోజులు గడిచినా అధికారులు లారీలను ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో రైతులు నానా యాతన పడుతున్నారు. ఈసారి ధాన్యం తరలించే వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. లారీలను సకాలంలో పంపించేందుకు తీసుకుంటున్న చర్యలేంటీ అనేవి మాత్రం చెప్పని పరిస్థితి ఉంది. ఇక మరో ప్రధాన సమస్య గోనెసంచులు. ధాన్యం పట్టేందుకు కనీసం గోనెసంచులు కూడా అందించని పరిస్థితి గతంలో నెలకొంది. ఇచ్చిన సంచులు సైతం చిరిగినవి ఉంటున్నాయి. దీంతో రైతులు సంచుల గురించి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు మూడు కోట్ల సంచులు అవసరమని అంచనా వేశారు. ఇప్పటి వరకూ సంచుల ఏర్పాటు పూర్తి కాలేదని సమాచారం. సంచుల ఏర్పాటులో నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మరోసారి రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని చెప్పొచ్చు. ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యతిచ్చి ముందుగానే సమస్యలపై దృష్టి సారించకపోతే గతంలో మాదిరిగానే సమస్యలు పునరావృతమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. దీనిపై అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ధాన్యం కొనుగోలుకు..
ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి
జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రశాంతి డివిజన్, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణ, రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్, ఎలక్షన్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లకు ఆర్‌బికెలో పూర్తిస్థాయిలో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే అన్ని ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలుకు కావాల్సిన మెటీరియల్ అందజేయడం జరిగిందని, అధికారులు సంబంధిత సిబ్బందితో క్షేత్రస్థాయిలో లోటుపాట్లను గుర్తించి సరిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయి సమస్యల తక్షణ పరిష్కారం కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌కాల్ చేసి సరి చేసుకోవాలన్నారు. కొనుగోలుకు సంబంధించి తేమ శాతం, టోకెన్స్ జారీ, నాణ్యతా ప్రమాణాలు తదితర వాటిపై సిబ్బందితో ప్రాక్టికల్‌గా చేయించామన్నారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా స్నేహపూరిత వాతావరణంలో అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. రైతులు పంట కోసే మూడు రోజుల ముందు వారికి కావాల్సిన గోనె సంచులు అందజేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో తగినన్ని గోనె సంచులు నిల్వ ఉంచుకోవాలని, ఎక్కడా గోనె సంచుల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలన్నారు. ఖరీఫ్ సాగుకు ఎక్కడా నీటి కొరతలేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలు గ్రామాల్లో రెండు, మూడు దశలలో రీసర్వే అనంతరం జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ పురోగతిపై ఆరా తీశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి లేఅవుట్‌లో ఉన్న ఇబ్బందులను సరి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి జివికె మల్లికార్జునరావు, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివ రామ ప్రసాద్ పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి
సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ హరేరాం


ప్రజాశక్తి - భీమవరం

ఢిల్లీ రైతులు చేపట్టిన ఉద్యమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించబోయే మహాధర్నాను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరాం పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి తెలుగురైతు నాయకులు తమ్మినీడి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరేరాం మాట్లాడుతూ ఢిల్లీలో రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై 500 రైతుసంఘాలు 13 నెలలపాటు చేసిన ఆందోళన ఫలితంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నవంబర్ రెండో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరంలో ఆనంద ఫంక్షన్ హాల్‌లో రైతు సదస్సు నిర్వహించనున్నామన్నారు. సదస్సుకు మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు హాజరు కానున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం న్యూస్ క్లిక్ ఎడిటర్ తదితరులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లో రైతు ఉద్యమానికి విదేశీ నిధులు అందించిందని పేర్కొన్నదని, దీన్ని ఖండిస్తూ నవంబర్ 6న అన్ని మండల కేంద్రాల్లో ఎఫ్ఐఆర్ కాపీలు దహనం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు లంకా కృష్ణమూర్తి, సభ్యులు దండు శ్రీనివాసరాజు, తెలుగురైతు టౌన్ అధ్యక్షులు పాలా శ్రీరామదాసు, రైతుసంఘం నాయకులు చెల్లబోయిన రంగారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పాల్గొన్నారు.

బిసిలు, ఎస్‌సిలకు అత్యధిక పదవులు
సిఎం జగన్ ఘనత

ప్రజాశక్తి - నరసాపురం టౌన్, మొగల్తూరు

వైసిపి ప్రభుత్వంలో అత్యధిక మంత్రి పదవులు బిసిలు, ఎస్‌సిలకే దక్కాయని, ఈ ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక మెయిన్ సెంటర్‌లో శుక్రవారం సామాజిక సాధికారిత యాత్ర సభ నిర్వహించారు. తొలుత మొగల్తూరు నుంచి ప్రారంభమైన యాత్ర రామన్నపాలెం మీదుగా పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు స్థానిక ఎంఎల్ఎ, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షత వహించారు. మంత్రి గోపాలకృష్ణ మాట్లాడుతూ జగన్ పాలనతోనే పేదరికం రూపుమాపుతోందని, పేదోడి జీవితంలో మార్పు మొదలైందని తెలిపారు. మరో మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ బిసిలను ఛీకొట్టిన చంద్రబాబు జైలు పాలయ్యాడని ఎద్దేవా చేశారు. బిసిలను అవమానించిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో కూడా పిలుపునిచ్చారు. మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ ప్రజల కోసమే ఆలోచించే నాయకుడు జగన్ అని, జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే దళితులకు, బిసిలకు గుర్తింపు లభిస్తుందని అన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ వైసిపి బిసిల పార్టీ అని అన్నారు. ఉన్నత విద్యతోనే పేదరికాన్ని రూపుమాపొచ్చని జగన్ నిరూపించారన్నారు. కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, ఎంఎల్‌సి వంక రవీంద్ర, కవురు శ్రీను, పోతుల సునీత, రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ జయరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. యాత్ర ప్రారంభానికి ముందు మొగల్తూరులోని లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహారాజు, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి గోపాలకృష్ణ

విధుల్లో అలసత్వం వహిస్తే సహించను : కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

స్వమిత్వ సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని, విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెలివర్రు గ్రామ సచివాలయంలో స్వమిత్వ సర్వేకు సంబంధించిన కంప్యూటర్ డేటాను, రిజిస్టర్లను జిల్లా కలెక్టరు పరిశీలించారు. 9(2) నోటీసులు గృహ యజమానుల అందరికీ జారీ చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శిపై జిల్లా కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలెక్టర్ స్వమిత్వ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ నోటీసులు జారీచేసి వారి సమక్షంలోనే సర్వే చేయాలన్నారు. గ్రామకంఠం సర్వేలపై అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ, గ్రామకంఠం భూములు సర్వే చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్తి అనుభవిస్తున్న వారికి యాజమాన్య హక్కు పత్రాలు అందజేయాలన్నారు. రహదారులు, డ్రెయినేజీలు, ప్రభుత్వ, ప్రయివేటు స్థలాలు, భవనాలు అన్ని ఖచ్చితమైన ఆధారంతో సర్వే జరపాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జివికె మల్లికార్జునరావు, సర్వే అధికారులు కె.జాషువా, తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్, మండల విస్తరణాధికారి అందే కొండలరావు పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

దళితుల శ్మశాన వాటికలు, ఇళ్ల స్థలాలు, డ్రెయినేజీ, రోడ్లు సమస్యలపై ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కెవిపిఎస్ ఆధ్వర్యాన జిల్లావ్యాప్తంగా చేపట్టిన దళిత రక్షణ యాత్రలో దళితపేటల్లో అనేక సమస్యలను గుర్తించినట్లు పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా నేటికీ దళితులు అభివృద్ధికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు బతికినంత కాలం కుల వివక్షను ఎదుర్కొంటున్నారని, చనిపోయిన తర్వాత ఖననం చేసే విషయంలో కూడా వివక్ష కొనసాగుతుందనడానికి నేటికీ శ్మశాన వాటికలు లేకపోవడమేనని పేర్కొన్నారు. దళిత పేటల్లో డ్రెయినేజీ, సీసీ రోడ్లు, తాగునీరు వంటి అనేక సమస్యలతో దళితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దళిత చర్మకారులకు కనీస గుర్తింపు కూడా ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. డప్పు కళాకారులకు కనీస భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం జిల్లా అధికారులు దళితులకు శ్మశానవాటికలు కేటాయించాలని, పెండింగులో ఉన్న డ్రెయినేజీ, సీసీ రోడ్లు తక్షణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కెవిపిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు దళితులంతా తరలి రావాలని వారు కోరారు.

30న రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయండి
సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 30న ఆక్వా, వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. స్థానిక మెంటేవారితోటలో ఏర్పాటుచేసిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. భీమవరంలో టౌన్ రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను చర్చిస్తామన్నారు. ఈ సదస్సుకు ప్రముఖ రాష్ట్ర రైతు నాయకులు వై.కేశవరావు, సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎన్.వేణుగోపాలరావు హాజరుకానున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల వరికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. వేల కోట్ల ఆదాయం సమకూరుస్తున్న ఆక్వా రంగం సంక్షోభంలో ఉందన్నారు. దీంతో సన్న చిన్నకారు, మధ్యతరగతి రైతాంగం నలిగిపోతున్నారన్నారు. ఆక్వారంగ సమస్యలు పరిష్కరించాలని సదస్సు ద్వారా కోరుతున్నామన్నారు.

వీరవాసరం : ఈ నెల 30న భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి రైతు సదస్సులో రైతులంతా పాల్గొనాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి కోరారు. శుక్రవారం వీరవాసరంలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, టైలరింగ్ అధ్యక్ష కార్యదర్శుల సమావేశం బొబ్బనపల్లి సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో 140 కోట్ల మంది ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. రైతు, వ్యవసాయ సాగులో ప్రకృతి వైపరీత్యాలను, సాగులో చీడపీడలను తట్టుకుంటూ దేశానికి ఆహార ఉత్పత్తులు అందిస్తున్న రైతాంగానికి న్యాయమైన మద్దతు ధర ఇవ్వకుండా ప్రభుత్వాలు మోసగిస్తున్నాయన్నారు. ధాన్యం అమ్మకాల్లో తేమ శాతం పేరుతో ప్రభుత్వం నిర్దేశించిన ధరలో కోత విధిస్తున్నారన్నారు. దీనికి తోడు సంచుల కొరత, సకాలంలో అమ్మిన ధాన్యానికి సొమ్ము చెల్లించకపోవడం వంటి సమస్యలు రైతులు ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యానికి వంద కిలోలకు కనీస మద్దతు ధర రూ.2810 ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీకి, తూకంలో మోసాలకు అవకాశం లేకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేరళ తరహాలో వంద కిలోలకు రూ.900 బోనస్‌ను అన్ని పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలన్నారు. రొయ్య, చేపల మేత ధరలు పెరగడం, సీడ్, మేత నాణ్యతలో లోపాల వల్ల వైరస్, వాతావరణ మార్పులతో కోలుకోని విధంగా ఆక్వా రైతులు నష్టపోతున్నారన్నారు. కరెంటు ఛార్జీల పెంపుతో రైతులు, ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. విత్తనం నుండి విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాలు చూస్తాయంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పినా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కొన్ని రైతు భరోసా కేంద్రాల తాళాలు తీయడం లేదన్నారు. రైతులకు ఏ మాత్రం ఉపయోగం లేని విధంగా రైతుభరోసా కేంద్రాలున్నాయన్నారు. వ్యవసాయ రంగాన్ని, ఆక్వా రైతు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు, ప్రభుత్వ విధానాలు, పరిష్కారం, ప్రత్యామ్నాయ అంశాలపై భీమవరంలో జరిగే రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేతా జ్యోతిబసు, అయినపూడి బాబూరావు, పాలా కోటేశ్వరరావు, యాళ్లబండి నారాయణమూర్తి, కిలాడి సత్యనారాయణ, గొట్టుముక్కల శ్యాంబాబు, మైగాపుల త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

కేంద్రం రాష్ట్రానికి చాలా అన్యాయం చేసిందని రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. నవంబర్ 15వ తేదీన విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రటరీ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హోదా గాని, రైల్వే జోన్ గాని, రాజధాని నిర్మాణానికి నిధులు గాని, వెనుకబడ్డ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వక రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని తెలిపారు. నవంబర్ 15న సిపిఎం ప్రజా రక్షణ భేరి యాత్ర విజయవాడలో జరగనుందని, దీన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, ఎ.నారాయణ, అడపా ఆంజనేయులు, ఎస్‌విఎస్ మద్దాల పుత్రయ పాల్గొన్నారు.

గణపవరం : నవంబర్ 15న సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. పిప్పర వాసవీ కళ్యాణ మండపంలో జరిగిన మండలం పార్టీ సభ్యుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి చిన్నం చిన్న నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పి.నరశింహమూర్తి, నాయకులు, పి.గోవిందు, ఎన్.రామకృష్ణ, పి.వెంకటలక్ష్మి, జి.శ్రీనివాస్, ఎస్.సంజీవీరావు పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు తీసుకున్న పలు అంశాలపై ఉద్యమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులు చేసిన పార్టీ సిపిఎం అని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నాయకురాలు డోకర్ లక్ష్మి అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిపిఎం మరో మహోద్యమం కోసమే ప్రజా రక్షణ భేరి మోగిస్తోందని చెప్పారు. కేంద్రాన్ని ప్రశ్నించే సత్తా జగన్‌కు లేదన్నారు. నవంబర్ 15న విజయవాడలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి కె.తవిటినాయుడు, కార్యవర్గం పెంకి అప్పారావు, డొకల రవితేజ పాల్గొన్నారు.

యలమంచిలి: బిజెపి ప్రభుత్వానికి అధికార పార్టీ వైసిపి, ప్రతిపక్ష పార్టీలు టిడిపి, జనసేన వత్తాసు పలకడం చూస్తే బిజెపితో పాటు ఈ మూడు పార్టీలు కూడా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నట్లేనని సిపిఎం నేత కౌరు పెద్దిరాజు వ్యాఖ్యానించారు. చించినాడలో సిపిఎం మండల కార్యకర్తల సమావేశం స్థానిక శెట్టిబలిజిపేట రామాలయం వద్ద పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దిరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బిజెపితో అంటగాగే పార్టీలకు సిపిఎం దూరంగా ఉంటుందన్నారు. వచ్చే నెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభను ప్రజలంతా జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేతా సూర్యారావు, కానేటి బాలరాజు, మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, గుబ్బల చక్రపాణి, గూడూరి ఆంజనేయులు, శ్రీరాములు, చెల్లుబోయిన వడ్డీ కాసులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ వైద్య సేవలు
ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

నిపుణులైన వైద్యులతో ప్రతి కుటుంబానికి వైద్య సేవలు అందిస్తున్నామన్నాని, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా నడుస్తున్నాయని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని వైఎస్.పాలెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన మెడికల్, పౌష్టికాహారం స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యశ్రీలో ఏయే రోగాలకు వైద్యం పొందొచ్చో ప్రజలకు తెలియజేయాలని ఆరోగ్యమిత్రలకు సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసాదరాజు మాట్లాడుతూ మరింత మంది వైద్య సేవలు పొందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ శిబిరంలో ఇసిజితోపాటు 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. వారికి సంబంధించిన మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు. ఇక్కడ నయంకాని రోగాలకు మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీలో చేర్చిన కార్పొరేట్ ఆసుపత్రికి పంపి వైద్యం చేయిస్తారన్నారు. ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ, ప్రజాప్రతినిధులు యర్రంశెట్టి బాబులు, పితాని సత్యనారాయణ, గుబ్బల వెంకటేశ్వరరావు, గుబ్బల రామారావు, గుబ్బల వెంకటేశ్వరరావు, తెలగంశెట్టి వాసు, ఎంపిడిఒ ఎన్.శివ ప్రసాద్‌యాదవ్, డాక్టర్లు, సచివాలయ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

నేడు చంద్రగ్రహణం

ప్రజాశక్తి - ఉండి

నేడు ఆకాశంలో ఏర్పడే చంద్రగ్రహణం చాలా అరుదైనదని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు గాదిరాజు రంగరాజు తెలిపారు. చంద్రగ్రహణం సమయంలో చంద్రుడి నుంచి వచ్చే కిరణాలు అమృతాన్ని చిమ్ముతున్నట్లుగా కనిపిస్తాయని తెలిపారు. ఈ గ్రహణం మొత్తం 16 దిశల్లో కనిపిస్తుందని తెలిపారు. తొమ్మిదేళ్ల కిందట ఇలాంటి గ్రహణం ఏర్పడిందన్నారు. శరద్ పౌర్ణమి రోజున ఏర్పడుతున్న ఈ గ్రహణం భారత కాలమానం ప్రకారం అక్టోబర్ 28 అర్ధరాత్రి ఒంటిగంట నాలుగు నిమిషాలకు ప్రారంభమై రాత్రి రెండు గంటల 24 నిమిషాలకు ముగియనుందని తెలిపారు. గ్రహణానికి ముందు నారింజ రంగులో చంద్రుడు ప్రకాశిస్తాడని, సూర్యకాంతి పొందిన భూమి వాతావరణం చంద్రుడిపై ప్రతిబింబించడం వల్ల ఎర్రగా మారుతుందని తెలిపారు. ఈ పాక్షిక చంద్రగ్రహణం భారత్‌తో పాటు నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్, చైనా తదితర దేశాల్లో కనువిందు చేస్తున్నట్లు రంగరాజు తెలిపారు.

నేడు పెదగోపురం మూసివేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఈ నెల 28వ తేదీ శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు చంద్రగ్రహణం సందర్భంగా మూసివేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. సంప్రోక్షణ అనంతరం తిరిగి 29వ తేదీ ఆదివారం ఉదయం 8.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తామని తెలిపారు. యాత్రికులు గమనించాలని వారు కోరారు.

మంగారావు కృషి ఎనలేనిది

ప్రజాశక్తి - పోడూరు

సిపిఎం నాయకులు బొక్కా మంగారావు వర్ధంతి సభ మూడే మోజేశ్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సభలో మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ మంగారావు పార్టీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారన్నారు. తూర్పుపాలెం సర్పంచిగా పనిచేసి గ్రామానికి ఎన్నో సేవలందించారన్నారు. ముందుగా శాఖా కార్యదర్శి కంకటాల భాస్కరరావు స్థూపం పైన పతాకాన్ని ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు కేతా కృష్ణారావు మంగారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సానుభూతి పరులు పాల్గొని జోహార్లు అర్పించారు.

మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఉండి

నవంబర్ 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో జరగనున్న మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని పిలుపునిచ్చారు. ఉండి ఎంపిపి ఆవరణలో జరుగుతున్న మహిళా సమాఖ్య జిల్లా 15వ మహాసభల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. 17న నంద్యాలలో జరిగే మహిళల మహా ప్రదర్శన, బహిరంగ సభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని దుర్గాభవాని కోరారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ మహిళల సమున్నత అభివృద్ధి, లింగ వివక్షత వ్యతిరేకంగా, మహిళా సాధికారత సాధనకు, పోరాటాలకు పూనుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడారు. అనంతరం మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలుగా నెక్కంటి జగదాంబ, ప్రధాన కార్యదర్శిగా సికిలే పుష్పకుమారి, ఉపాధ్యక్షులుగా సోడదాని సరోజిని, సావారపు దేవి, యర్రంశెట్టి శాంతమణి, ఎస్.నాగలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా ఆట్లాడ కనక మహాలక్ష్మి తదితర నేతలను ఎన్నుకున్నారు.

'చంద్రబాబు భద్రతపై అనుమానాలు'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు నాయుడి భద్రతపై అనుమానాలు ఉన్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో బాబుతో నేను కరపత్రాల పంపిణీ కార్యక్రమం పట్టణంలోని మెంటేవారితోట ఒకటో వార్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అక్రమ కేసులతో జైల్లో పెట్టిన చంద్రబాబు భద్రతపై అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర కార్యదర్శి వెంగ్రి శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రాణానికి హాని జరిగితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో నేతలు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

108 కేజీల లడ్డూ వేలం

ప్రజాశక్తి - కాళ్ల

కోమటిగుంట గ్రామంలో కనకదుర్గమ్మ వారి వద్ద ఉంచిన లడ్డూను లక్ష రూపాయలకు దక్కించుకున్న మాజీ సర్పంచి యలమంచిలి రామాంజనేయులును ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అభినందించారు. కోమటిగుంటలో అమ్మవారి ఆలయంలో రామాలయం కమిటీ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ వారి లడ్డూ వేలం పాట నిర్వహించారు. 108 కేజీల లడ్డూను లక్షా ఒక రూపాయికి మాజీ సర్పంచి యలమంచిలి రామాంజనేయులు దక్కించుకున్నారు. ఎంఎల్‌ఎ రామరాజు అమ్మవారిని దర్శించుకుని అన్న సమారాధనలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎంఎల్‌ఎను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యలమంచిలి వెంకటరమణ, యలమంచిలి రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు గుర్రం వెంకట సత్యనారాయణ, పులమంతుల ఏసురాజు, మంతెన నాగ ఆంజనేయులు, యలమంచిలి బాబ్జి, కాపుశెట్టి సత్యనారాయణ, యలమంచిలి గణపతి పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని రైతులందరూ ఇ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఉప్పులూరులోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ క్రాప్ సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న కెఎస్ఎస్ శ్రీనివాస్, తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడారు. ఇ-పంట నమోదు చేసుకోని రైతులు వెంటనే చేసుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వ పథకాలు పొందలేరని తెలిపారు. ఈ క్రాప్‌లో నమోదైన రైతుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. వివరాల్లో మార్పులు, చేర్పులు అక్టోబర్ 29వ తేదీలోపు సరి చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య, గ్రామ రెవెన్యూ అధికారి ఎ.బాబి, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బాలికలు ఎదగాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యలో బాలికలు మండలస్థాయిలో కాకుండా నియోజకవర్గ స్థాయికి ఎదగాలని గణపవరం రెండో ఎంఇఒ బాలయ్య అన్నారు. శుక్రవారం మండలస్థాయిలో 2023లో ఎస్‌సిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన బాలికల హైస్కూల్ విద్యార్థినులకు యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ బాలికలు విద్యలోనే కాకుండా అన్నిరంగాల్లో ఎదగాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న యుటిఎఫ్ నాయకులను ఆయన అభినందించారు. యుటిఎఫ్ మండల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు జాలెం నాని, జిల్లా సిపిఎస్ సబ్ కమిటీ కోకన్వీనర్ భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ప్రజాశక్తి - పాలకోడేరు



కాళ్ల : మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరుపేదలకు గొప్ప వరమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. వేండ్ర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పివిఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు గ్రామ సర్పంచి కడలి నాగేశ్వరి అధ్యక్షత వహించగా పివిఎల్ మాట్లాడారు. సంక్షేమం అభివృద్ధితోపాటు ప్రజలకు ఆరోగ్యాన్ని అందించాలన్న ముఖ్యోద్దేశంతో ఆరోగ్య సురక్షను చేపట్టినట్లు తెలిపారు. ఎంపిపి చంటి రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి భూపతిరాజు సుబ్బరాజు, ఎంపిటిసి పాల జ్యోతి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, సర్పంచులు గొట్టుముక్కల వెంకట శివరామరాజు, జంగం సూరిబాబు, కడలి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోడూరు : ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలందిస్తోందని వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల గోపి అన్నారు. శుక్రవారం వేడంగి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వాలంటీర్లు, ఎఎన్ఎంల ఆరోగ్య సర్వేతో పాటు గ్రామ సచివాలయ పరిధిలోని సిడి ఎన్‌సిడి సర్వే జాబితా వివరాల ఆధారంగా రోగులను గుర్తించి ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ఆసుపత్రులపై శిబిరానికి వచ్చే రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చెల్లుబోయిన పద్మ శారద, తహశీల్దార్ ఆర్‌వి కృష్ణారావు, ఎంపిడిఒ డి.సుహాసిని, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

కాళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమని, దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. శుక్రవారం ప్రాతళ్లమెరక గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో 95 శాతం గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెనుమత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, డాక్టర్ ఎం.గులాబ్ రాజ్ కుమార్, వైసిపి గ్రామ అధ్యక్షులు వేగేశ్న బాలగణపతి వర్మ, టిడిపి గ్రామ అధ్యక్షులు కంతేటి శ్రీనివాసరాజు, కంతేటి సుబ్బరాజు, కోపల్లె సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కాళ్ల : మాట్లాడుతున్న పివిఎల్ నరసింహరాజు

మున్సిపల్ కమిషనర్ శేషాద్రి బదిలీ

ప్రజాశక్తి - పాలకొల్లు



శేషాద్రి

మున్సిపల్ కమిషనర్ శేషాద్రి ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్‌ను ఎఫ్‌ఎసి కమిషనర్‌గా నియమించారు. కరోనా కాలంలో లక్షలాది రూపాయల బిల్లులు గత మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పెండింగులో ఉంచగా వాటిపై శేషాద్రి సంతకం పెట్టినందుకు ఈ ఆకస్మిక బదిలీ అని తెలియవచ్చింది. దీనిపై పట్టణంలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

గరగపర్రు దళితులకు పెండింగ్ రాయితీలు అందించాలి

ఎస్‌సి, ఎస్‌టి సెల్ జిల్లా మోనటరింగ్ కమిటీ సభ్యులు బాలకృష్ణ

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రు సాంఘిక బహిష్కరణ ఘటన జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ పూర్తిస్థాయిలో పరిహారం అందించలేదని, దళితులకు రావాల్సిన రాయితీలు తక్షణం అందించాలని ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మోనటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ భీమవరం ఆర్‌డిఒ శ్రీనివాసులరాజును కోరారు. భీమవరం ఆర్‌డిఒగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులరాజును స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో శుక్రవారం బాలకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో దళితులపై గతంలో జరిగిన దాడులు, అన్యాయ ఘటనలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వెలివర్రు, గరగపర్రు ఘటనలను ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. దళితులకు రావాల్సిన రాయితీలు తక్షణం అందించాలని కోరారు.

ప్రతి వార్డులోనూ అభివృద్ధి కార్యక్రమాలు

ఎంఎల్‌ఎ గంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అభివృద్ధిలో భీమవరం పట్టణాన్ని అగ్రగామిగా నిలుపుతామని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో 34వ వార్డులోని నిమ్మకాయల వారి వీధిలో రూ.7 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను, ఆర్ఆర్‌డిఎస్ కాలేజీ నుంచి సూర్య టవర్స్ వరకూ రూ.28 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి మాటల్లో కాదని చేతల్లో చేసి చూపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పట్టణంలో సుమారు 8 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి, గృహ నిర్మాణాలకు రూ.లక్షా 80 వేల నిధులను ఉచితంగా అందిస్తున్నామని తెలిపార. అమృత పథకంలో నిర్మించిన మంచినీటి రిజర్వాయర్లను ఒక్కొక్కటిగా త్వరలో ప్రారంభిస్తామన్నారు. భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ముదునూరి సుబ్బరాజు, తోట భోగయ్య, ఎఎస్.రాజు, గాదిరాజు సుబ్రహ్మణ్యరాజు, కోడే యుగంధర్, సాంబ్రాణి నరేష్, స్వాతి సుబ్బరాజు పాల్గొన్నారు.

గూడెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ అధ్యక్షులు వంగపండు రామ్మోహనరావు ఆధ్వర్యంలో లయన్స్ డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్ ఈతకోట తాతాజీ పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో జనతా ఛారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులతో ఉచిత గుండె వైద్య శిబిరం శుక్రవారం స్థానిక 21వ వార్డు, కొబ్బరితోటలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా రీజియన్ ఛైర్పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్ పాల్గొన్నారు. ఈ క్యాంపులో 154 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, గ్రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వచ్చే నెల 8వ తేదీన విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే డిమాండ్లపై రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విద్యా సంస్థల బంద్‌ను జిల్లాలో జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం భీమవరంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సుందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం కోసం 32 మంది విద్యార్థులు తమ ప్రాణాలర్పించారన్నారు. అలాంటి ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తోందన్నారు. ఈ బంద్‌కు జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల అధిపతులు సంఘీభావం తెలపాలన్నారు. పిడిఎస్‌యు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి సిహెచ్ నాగరాజు మాట్లాడారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు గంటా పవన్, ఆర్.మణిదీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపిని మరోసారి గెలిపించుకుందాం

ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రాబోయే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గంలో టిడిపిని మరోసారి గెలిపించుకుందామని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ప్రజలను కోరారు. మాలవానితిప్ప గాంధీనగర్, సత్యనారాయణ పురం గ్రామాల్లో బాబుతో నేను ఇంటింటికీ ప్రచార కార్యక్రమా లను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు ఎప్పుడూ ఇంత దుర్మార్గపు పాలన చూడలేదన్నారు. పోలీసు వ్యవస్థను ఇతర వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. చంద్రబాబును తప్పుడు కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, మాజీ సర్పంచి మంతెన వెంకట్రాజు, టిడిపి నాయకులు సాగిరాజు సోమరాజు, అల్లూరి దొరయ్య చౌదరి పాల్గొన్నారు.

పాలకోడేరు ఎంపిడిఒ సరెండర్

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు ఎంపిడిఒ నూకల మురళి గంగాధరరావును ప్రభుత్వం సరెండర్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు తెలిపారు. ఇటీవల కాలంలో పంచాయతీ కార్యదర్శులపై పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ కనీస చర్యలు చేపట్టకపోవడం పట్ల ఇటీవల జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఎంపిడిఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ పరంగా చేసే సర్వేలో కూడా వెనకబాటు తనం కనబర్చడంతో ప్రభుత్వానికి సరెండర్ చేసినట్లు తెలిపారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా పనితీరు మార్చుకోవడం లేదంటూ పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి రమాలీలను ఇప్పటికే సరెండర్ చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైంది.

చదువుతోపాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బాల్యం నుంచి చదువుతో పాటు క్రీడలు అవసరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు విశాల్ అన్నారు. తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-14, అండర్-17 బాల బాలిక క్రీడా పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి హాజరైన క్రీడాకారుల చేయట మీదుగా పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడలు మనోధైర్యాన్ని ఇస్తాయన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విశాల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి వట్టి బుజ్జి, ఎన్‌సిసి.కోచ్ గణపతిరావు, ఎంఇఒ టివి రామకృష్ణ పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారి పి.స్పందన తెలిపారు. శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. వడలి గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాఫ్ట్ ముసాయిదా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాసాని విజయలక్ష్మి, ఎంపిటిసి శ్రీ రెడ్డి గణేష్‌రావు పాల్గొన్నారు.

కుటుంబ సాధికార సభ్యులను బలోపేతం చేయాలి : గన్ని

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కుటుంబ సాధికార సభ్యులను బలోపేతం చేయాలని టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం తాడేపల్లిగూడెం నియోజకవర్గ టిడిపి విస్తృతస్థాయి సమావేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు అధ్యక్షతన మెట్టఉప్పరగూడెం వలవల బాబ్జి వ్యవసాయ క్షేత్రంలో జరిగింది. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలన్నారు. చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి 50 రోజులు అవుతోందన్నారు. ఎటువంటి నేరం లేకపోయినా కక్షపూరితంగా సైకో సర్కార్ అక్రమ అరెస్టుకు పాల్పడిందన్నారు. వాలంటీర్ల వ్యవస్థకు దీటుగా నిర్మించిన వ్యవస్థ కుటుంబ సాధికార వ్యవస్థ అని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టిడిపి పొత్తు శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పోతుల అన్నవరం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, మండల, పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు లిపాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేస్తూ ఎంఎల్‌ఎ నిమ్మల నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

ముఖ్యమంత్రి జగన్ పాలకొల్లులో లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అప్పగించకపోవడాన్ని నిరసిస్తూ ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు రెండో రోజు శుక్రవారం కూడా పారిశుధ్య కార్మికులతో కలిసి పట్టణంలో పారిశుధ్య పనులు చేశారు. పలు ప్రాంతాల్లోని చెత్తా, చెదారం ఎత్తి నేరుగా ట్రాక్టర్లో ఎగుమతి చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ విలేకరులతో మాట్లాడారు. టిడ్కో గృహాలు ఉచితంగా ఇస్తామని చెప్పి మాట తప్పిన సిఎం జగన్ పెత్తందారీ పక్షం అన్నారు. మాట తప్పిన జగన్‌పై పేదలు ఆగ్రహంతో ఉన్నారన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఉండి: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందొచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు. శుక్రవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, దోమలు వ్యాప్తి చెందే ప్రదేశాలను గుర్తించి స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

రవాణా, హమాలీ ఛార్జీలు ప్రభుత్వమే చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - గణపవరం

రైతులకు హమాలీ, రవాణా ఛార్జీలు ప్రభుత్వమే చెల్లించాలని రైతు సంఘం మండల కార్యదర్శి జి.శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి.నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యాన కేశవరం ఆర్‌బికె వద్ద నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర చెల్లించాలని అన్నారు. కేరళ, తమిళనాడు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో రూ.500 రూ.900 పెంచి ఇస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా 500 పెంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌బికెలో నిర్ణయించిన ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనాలని, కిరాయి వసూళ్లు ఆపాలని అన్నారు. అనంతరం ఆర్‌బికె అధికారి జి.వెంకటరత్నానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎస్.సంజీవరావు, యాళ్ల నరశింహమూర్తి, పి.లక్షణరావు, జె.రాజారావుతోపాటు కేశవరం, అప్పన్నపేట, జల్లికాకినాడ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

గొల్లలకోడేరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా లక్ష్మి

పాలకోడేరు: పెన్నాడ అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా ప్రస్తుతం పనిచేస్తున్న కె.లక్ష్మిని గొల్లలకోడేరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా నియమిస్తూ మండల పరిషత్తు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా పనిచేసిన పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి రమాలీలను ఇటీవల ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అలాగే పాలకోడేరు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా మోగల్లు పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజును నియమించారు. అలాగే గొరగనమూడి పంచాయతీ కార్యదర్శి ఎ.పోలయ్య నా మట్టి నా దేశం కార్యక్రమానికి సంబంధించిన మట్టి కలశాన్ని ఢిల్లీ తీసుకెళ్తున్న నేపథ్యంలో ఇక్కడ ఖాళీ ఏర్పడడంతో గొరగమూడి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా లక్ష్మిని నియమించారు.

'చంద్రబాబును జైల్లో కొనసాగించాలనే కుట్ర'

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం జైల్లోనే కొనసాగించాలని చూస్తోందని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు విమర్శించారు. మొగల్తూరులోని టిఆర్‌కెఆర్ బజార్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రెండు నెలల కావస్తున్నా పలు కారణాలు చూపిస్తూ జైల్లోనే కొనసాగించాలని చూస్తున్నారన్నారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న చంద్రబాబు నాయుడును ఆస్పత్రికి తరలించి చికిత్స అందించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. జెడ్ కేటగిరి రక్షణలో ఉన్న ఆయనను ఏమాత్రం రక్షణ లేని జైల్లో పెట్టారని, ఈ విషయంపై ఆయన సిఐడి కోర్టులో న్యాయమూర్తికి లేఖ ద్వారా తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కు పుల్లయ్య మెండు రాజేష్ దొంగ స్వామి, చింతన్న, దేశంశెట్టి శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రొఫెసర్ పవన్ కుమార్‌కు పిహెచ్‌డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జెఎన్.పవన్‌కుమార్ చింతలకు ఫిజిక్స్‌లో గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ డాక్టర్ పవన్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ తాను చేసిన పరిశోధనకు గాను యూనివర్శిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఫిజిక్స్, విభాగం హెడ్ డాక్టర్ ఎంవి.సోమేశ్వరరావు, డాక్టర్ పవన్ కుమార్‌ను అభినందించారు.

వీరవాసరంలో అన్నదానం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో దసరాను పురస్కరించుకుని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. తొలుత కనకదుర్గమ్మ దేవాలయంలో ఎంఎల్‌ఎ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెలగలేరులో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వెలగలేరులోని సరస్వతి విద్యానికేతన్‌లో మానవత, పెనుగొండ రత్న డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వైద్యులు డాక్టర్ మేడపాటి మురళీజోగి రెడ్డి దంత సమస్యలు వాటి పరిష్కారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు, ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కోశాధికారి శ్రీనివాసుల మురళీకృష్ణ పాల్గొన్నారు.